# వాస్తవం

డెయిలీ. కామ్

ఉన్నది ఉన్నట్లుగా

డిజిటల్ పత్రిక

బుధవారం 13.05.2026

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి(కె.ఆర్)



జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం

Red 914/2015

జర్నలిస్ట్స్ సంక్షేమమే పరమావధిగా

జర్నలిస్ట్స్ హక్కుల కోసం....

వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...

సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110


## ధాన్యం కొనుగోలు ఆగొద్దు

**ప్రతి ఒక్క అధికారి జవాబుదారీతనంతో పని చేయాలి**

**లారీలు సమకూర్చని కాంట్రాక్టర్లపై క్రిమినల్ చర్యలు**

**కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ హెచ్చరిక**




**హైదరాబాద్, మే 12 :** ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా, పర్యవేక్షణ చేయక పోయినా జిల్లా కలెక్టర్లపై చర్యలు తీసుకోవటానికి వెనకాడబోనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ప్రతి ఒక్క అధికారి జవాబుదారీతనంతో పని చేయాలని ఆదేశించారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు సరైన చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం ఆయన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో సమస్యలపై కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసు కున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. గోనె సంచులు, హమాలీల కొరత లేకుండా చూడాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించాలని చెప్పారు. ఒప్పందం మేరకు లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులకు వెనకాడొద్దని అన్నారు. గోదాముల సమస్య ఉన్నట్లు తెలుస్తోందని, అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాళ్లు అద్దెకు తీసుకొని ధాన్యాన్ని తరలించాలని ఆదేశించారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అవసరమైన చోట పోలీస్ సాయం తీసుకుని ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని చెప్పారు. కొనుగోళ్లపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు సీఎస్కు నివేదిక పంపాలన్నారు.


ముఖ్యమంత్రిగారు..
గండిపడిన రోడ్డును
బాగుచేయించరా? | 4


# అదుపులేని ఖాకీతో ఆగమే

## రామగుండానికి పోలీస్ గండం?

- రామగుండంలో మితిమీరిన ఓ పోలీసు వ్యవహారం
- పాలకుల మెప్పుకోసం రోజుకో వివాదం
- స్మార్ట్ పోలీస్ అని ఓ వైపు ఉన్నతాధికారుల గొప్పలు...
- ఇక్కడేమో ఖాకీ బూతుల పర్వంపై పట్టింపులేనితనం
- ఎన్ని ఆరోపణలు వచ్చినా డోంట్ కేర్ అంటున్న ఖాకీ
- ప్రజాప్రతినిధుల అండదండలతో చెలరేగుతున్న వైనం
- ఇట్లయితే రామగుండంలో కాంగ్రెస్ గల్లంతే



కె.ఆర్ ఉన్నమాట

పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలో ఓ ఖాకీ తీరు అదుపుతప్పినట్లుగా ఆరోపణలు వస్తున్నాయి.నిత్యం ఏదో ఒక వివాదాన్ని తీసుకొస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.సుదీర్ఘ కాలం తర్వాత రామగుండంలో గడిచిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందిన విషయం తెల్సిందే.ఎన్నో ఆశల నడుమ పాలనా పగ్గాలు చేపట్టిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రామగుండం సుందరీకరణ పేరుతో అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటు న్నారు,ముఖ్యంగా గోదావరిఖని పట్టణంలో రోడ్లవెడల్పు కార్యక్రమాన్ని చేపడుతూ అనేక కట్టడాల కూల్చివేతలను చేపడుతున్న విషయం కూడా తెల్సిందే.ఈ క్రమంలో కొన్నివర్గాల నుంచి ఎమ్మెల్యే నిర్ణయాలపై హర్షం వ్యక్తం అవుతుండగా మరికొన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇదంతా ఇలా ఉంటే రామగుండం నియోజకవర్గంలో ఓ కీలక ఠాణాలో పనిచేస్తున్న ఓ ఖాకీ ఉన్నతాధికారి వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారింది.విధినిర్వహణ పేరుతో మితిమీరిన పోకడ పోతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ఖాకీలంటే అందరికీ రక్షణ ఇచ్చేవారు మాత్రమే.అంతే తప్ప తమ పిల్లలను,భార్యలను కూడా కాన్వాయ్‌లో తిప్పుకుంటూ ఉండేవారు కాదని ప్రజాప్రతినిధులు గుర్తించాలి.అవసరం ఉన్నా లేకున్నా డాబు దర్పాలు చూపెట్టడానికి పోలీసుల సైరన్‌లతో నిత్యం తమ చుట్టూ పోలీసులను తిప్పించుకోవడం అనేది ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుంది.





వివరాలు 8లో


దేశ యువత

## భవిష్యత్తుపై జరిగిన నేరం

**నీట్ పరీక్ష రద్దుపై రాహుల్‌గాంధీ ఫైర్**



కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను రద్దు చేయడంపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. దాదాపు 22 లక్షల మందికిపైగా విద్యార్థులు పడిన కష్టం, వారు కన్న కలలు బీజేపీ సారథ్యంలోని అవినీతి వ్యవస్థవల్ల ఛిన్నాభిన్నమయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు రాహుల్‌గాంధీ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. 'నీట్ పరీక్ష రద్దయ్యింది. దేశవ్యాప్తంగా 22 లక్షల మందికిపైగా విద్యార్థుల కఠోర శ్రమ, త్యాగాలు, కలలు ఛిన్నాభిన్నమయ్యాయి. పిల్లల చదువు కోసం కొందరి తల్లిదండ్రులు రుణాలు తీసుకున్నారు. కొందరు తల్లులు తమ నగలు అమ్ముకున్నారు. లక్షలాది మంది విద్యార్థులు ఈ పరీక్ష కోసం ఎన్నో రాత్రులు మేల్కొని ఉండి చదివారు. అందుకు వారికి దక్కిన ప్రతిఫలం ఏమిటంటే.. పేపర్ లీకేజీలు, ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా వ్యవస్థలో వ్యవస్థీకృతమైన అవినీతి. ఇది కేవలం వైఫల్యం కాదు. దేశ యువత భవిష్యత్తుపై జరిగిన నేరం. ప్రతిసారి పేపర్ మాఫియా ఎలాంటి శిక్షల్లేకుండా తప్పించుకు తిరుగుతుంటే.. నిజాయతీపరులైన విద్యార్థులు శిక్ష అనుభవిస్తున్నారు' అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ఇప్పుడు అదే లక్షలాది మంది విద్యార్థులు మరోసారి అదే మానసిక ఒత్తిడి, ఆర్థికపరమైన భారం, అస్థిరతను భరించాల్సి వస్తోందని రాహుల్‌గాంధీ మండిపడ్డారు. ఒకరి తలరాతను వారి శ్రమతో కాకుండా డబ్బు, పలుకుబడితో నిర్ణయిస్తుంటే ఇక విద్యకు నిజమైన అర్థం ఏముంటుందని ప్రశ్నించారు. ప్రధాని మోదీ చెబుతున్న 'అమృత్ కాలం' ఇప్పుడు 'విష కాలం' గా మారిందని ఎద్దేవా చేశారు.

## 86కే కుప్పకూలిన హైదరాబాద్

**దెబ్బకొట్టిన రబాడ, హోల్డర్**
**82 రన్స్ తేడాతో గెలిచి**
**టాప్ ప్లేస్‌కు గుజరాత్**

**అహ్మదాబాద్ :** భారీ స్కోర్లు కొడుతూ.. పెద్ద టార్గెట్లను అలవోకగా కరిగిస్తూ టాప్ గేర్‌లో దూసుకెళ్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు షాక్. బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై గుజరాత్ టైటాన్స్ పేసర్లు కొట్టిన దెబ్బకు ఆరెంజ్ ఆర్మీ నేలకు దిగింది. బ్యాటర్ల మూకుమ్మడి వైఫల్యంతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో 82 పరుగుల తేడాతో జీటీ చేతిలో చిత్తుగా ఓడిపోయింది. ఆ జట్టు ఇచ్చిన 169 పరుగుల లక్ష్య ఛేదనలో రైజర్స్ 14.5 ఓవర్లలో 86 రన్స్‌కే కుప్పకూలింది. కెప్టెన్ కమిన్స్ (19) టాప్ స్కోరర్. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కగిసో రబాడ (3/28), జేసన్ హోల్డర్ (3/20) దెబ్బ కొట్టారు. తొలుత సాయి సుదర్శన్ (44 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 61), వాషింగ్టన్ సుందర్ (33 బంతుల్లో7 ఫోర్లు, 1 సిక్స్‌తో 50) అర్ధశతకాలతో రాణించగా టైటాన్స్ 20 ఓవర్లకు 168/5 స్కోరు చేసింది. ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ తలోరెండు వికెట్లు పడగొట్టారు. 12 మ్యాచ్‌ల్లో వరుసగా ఐదో, ఓవరాల్‌గా ఎనిమిదో విజయంతో జీటీ టాప్ ప్లేస్‌కు దూసుకెళ్లగా.. అన్నే మ్యాచ్‌ల్లో ఐదో ఓటమితో రైజర్స్ మూడో స్థానానికి పడి పోయింది.



## డిజిటల్‌గా బీఆర్ఎస్ సభ్యత్వం

**హైదరాబాద్: :** పార్టీ సభ్యత్వ నమోదు విషయంలో బీఆర్ఎస్ పార్టీ డిజిటల్ విధానానికి ఓటేసింది. పార్టీ ప్రధాన కార్యదర్శులతో సమావేశమైన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 'సర్'తో పాటు పార్టీ సమన్వయకర్తల నియమాకాలపై చర్చించారు. మంగళవారం ఎర్రవల్లిలోని నివాసంలో దాదాపు ఆరుగంటల పాటు సాగిన ఈ సమావేశంలో ప్రతి నియోజక సమన్వయ కర్తలను నియమించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల చేపట్టిన సర్ ప్రక్రియతో పాటు ఓటర్ జాబితా సవరణ, తదితర కార్యాచరణ మొత్తం డిజిటల్‌గా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పార్టీ సభ్యత్వం కూడా డిజిటలైజేషన్ పద్ధతిలో జరపాలని బీఆర్ఎస్ ప్రార్టీ ప్రధాన కార్యదర్శులు అభిప్రాయ పడ్డారు. ప్రతి నియోజకవర్గానికి, రాష్ట్ర కమిటీ నుండి సభ్యత్వ సమన్వయకర్తను నియమించాలని నిర్ణయించారు. ప్రతీ మండలానికి మున్సిపల్ బాడీల వారీగా 'సభ్యత్వ నమోదు కార్యక్రమం సజావుగా నిర్వ హించడానికి, సభ్యత్వ సమన్వయ కమి టీ'లను రెండు మూడు రోజుల్లోగా నియ మించాలని తీర్మానించారు. డిజిటలై జేషన్



పద్ధతిలో సభ్యత్వ నమోదు చేయాలని భావించినందున రాష్ట్రంలోని 35, 655 పోలింగ్ కేంద్రాలో.. బూత్‌కు ఇద్దరు కార్యకర్తల చొప్పున మొత్తం 71,310 మంది పార్టీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు.సభ్యత్వ నమోదు కార్యక్రమం కోసం పలు జిల్లాలకు ఇంచార్జీలను నియమించారు.

రాగల 48 గంటల్లో తెలుగు రాష్ట్రాల్లో

## వర్షాలు



మండుటెండలు, తీవ్ర ఉక్కపోతతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ కేంద్రం తీపి కబురు చెప్పింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడుతోందని, ఈ అల్పపీడనం ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అదేవిధంగా ఈ వారం చివరి నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండ మాన్–నికోబార్ దీవులలోని కొన్ని ప్రాంతాలలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించేందుకు పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని వెల్లడించింది. నైరుతి బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడుతోందని, దానికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. రాగల 48 గంటల్లో అల్పపీడనం మరింత బలపడే అవకాశం ఉందని చెప్పింది.

# ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా జనగణనలో పాల్గొనాలి

## ఎంపీడీవో సత్యనారాయణ

వాస్తవం : జైపూర్



జైపూర్ మండలంలోని ఇందారం, టేకుమట్ల, నర్సింగాపూర్, గంగిపల్లి గ్రామపంచాయతీలను ఎంపీడీవో జి. సత్యనారాయణ, ఎంపీఓ శ్రీపతి బాపు రావు మంగళవారం సందర్శించి గ్రామాల్లో జరుగుతున్న జనగణనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సత్యనారాయణ మాట్లాడుతూ జనగణనలో భాగంగా ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటిని గుర్తించి, అందులో నివసిస్తున్న కుటుంబ సభ్యుల సంఖ్య, ఇతర వివరాలను సేకరించి ఒక్కో ఇంటికి గుర్తింపు సంఖ్య కేటాయిస్తున్నారని తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా జనగణనలో పాల్గొనాలని కోరారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని, ఎక్కడా పేమెంట్ పెండింగ్ లేకుండా చూడాలని హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పర్యటనలో ఇందారం సర్పంచ్ ఎండీ ఫయాజ్, ఉప సర్పంచ్ ఎల్కటూరి శివ, వార్డు సభ్యులు, హౌసింగ్ ఏఈ కాంక్ష, పంచాయతీ కార్యదర్శులు ఎల్. ప్రశాంత్, ఆర్. శ్రావణి, ఎస్. సుప్రియ, ఏ. సత్యనారాయణ, జనగణన ఎన్యూమరేటర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోళ్లు వేగవంతం చేయాలి

## సిపిఐ డిమాండ్

### ధూళ్మిట్ట,జాలపల్లి ఐకెపిల వద్ద రైతులతో కలిసి నిరసన

వాస్తవం : ధూళ్మిట్ట

మండలంలో నెలల తరబడి కొనుగోలు కేంద్రాల్లో నిలిచిపోయిన వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేయాలని సిపిఐ ధూళ్మిట్ట మండల కార్యదర్శి వలబోజు నరసింహాచారి ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు.మంగళవారం మండలంలోని జాలపల్లి ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిపిఐ ఆధ్వర్యంలో రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. నరసింహాచారి మాట్లాడుతూ రైతులు లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి నెలరోజులు గడుస్తున్నా కొనుగోలు చేయడం లేదు. కేంద్రాల్లో రైతులకు తాగునీరు,విద్యుత్, తార్పాలిన్ కవర్లు వంటి కనీస సౌకర్యాలు లేవు.సకాలంలో బార్దాన్ ఇవ్వక పోవడంతో రైతులు కల్లాల్లో పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడింది అని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే కొనుగోళ్లు వేగవంతం చేయాలని



డిమాండ్ చేశారు.లేని పక్షంలో రైతులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. చేటుకూరి ఆంజనేయులు,మెతుకు జగన్మోహన్ రెడ్డి,ఇస్తారి సాయిలు,యచరేణి బాలరాజు,గుండెల్లి సంపత్,గొట్టిమొక్కల పెంటచారి,అయిలేని కనకవ్వ, నర్మెట లచ్చుమ్మ, దాసరి పద్మ, ఆలకుంట కొమురమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మోత్కూర్ శాఖా గ్రంథాలయంలో

# డే విత్ లైబ్రరీ ప్రారంభం

వాస్తవం : మోత్కూర్





వేసవి సెలవుల్లో తల్లి దండ్రులు తమ పిల్లల్ని సెల్ ఫోన్‌కు దూరం చేసి గ్రంథాలయంలో గడిపేలా పాఠశాల విద్యార్థుల కోసం మోత్కూర్ శాఖా గ్రంథాలయం తలపెట్టిన 'గ్రంథాలయంలో ఒక రోజు' కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. తొలి రోజు 23 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తల్లి దండ్రుల నుండి డే విత్ లైబ్రరీ కార్యక్రమం పట్ల మంచి స్పందన వస్తోందని, విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని గ్రంథాలయ చైర్మన్ కోమటి మత్స్య గిరి తెలిపారు. మే 12 నుండి జూన్ 12 వరకు గ్రంథాలయ పనివేళలు ఉదయం 8:00 నుండి 11:00 గంటలకు వరకు , సాయంత్రం 3:00 గంటల నుండి 6:00 గంటల వరకు విద్యార్థులు గ్రంథాలయంలో గడపాలన్నారు. ఎక్కువ రోజులు గ్రంథాలయంలో పుస్తక పఠనం పాల్గొన్న 10 మంది విజేతలకు రూ " 2500 /- నగదు తో సత్కరిస్తామన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ఎలాంటి ప్రవేశ రుసుము లేదన్నారు. బుధవారం నుండి స్నాక్స్ కూడా అందిస్తామన్నారు. ప్రముఖులతో ప్రేరణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ వైస్ చైర్మన్ పోచం బిక్షపతి, లైబ్రరీ ఇంచార్జి చిలక మల్లి బాబు చారి పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష రదు

## త్వరలో కొత్త తేదీ ప్రకటన

**న్యూఢిల్లీ:** నీట్ యూజీ 2026 పరీక్షను రద్దు చేశారు. మే 3వ తేదీన నిర్వహించిన ఆ పరీక్షను రద్దు చేసినట్లు మంగళ వారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. అయితే నీట్ పరీక్షకు చెందిన కొత్త తేదీలను త్వరలో వెల్లడించనున్నట్లు ఎన్‌టీఏ పేర్కొన్నది.దేశవ్యాప్తంగా మెడిసిన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నీట్ యూజీ 2026 పరీక్ష నిర్వహించారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 552 నగరాలు, 14 అంతర్జాతీయ కేంద్రాల్లో కలిపి సుమారు 20 లక్షల మందికి పైగా విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరయ్యారు. అయితే 3న నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) పేపర్ లీక్ అయినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. నీట్ పరీక్షలో విద్యార్థులు ఎదుర్కొన్న ప్రశ్నలను పోలిన 100 ప్రశ్నలు పరీక్ష జరగడానికి ముందే సర్క్యులేట్ అయినట్టు ఆరోపణలు వచ్చాయి. దీనిపై రాజస్థాన్ పోలీసులు విచారణ చేపట్టారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు, పోలీసులు ఇచ్చిన సమాచారం ప్రకారం ఎగ్జామ్ ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పరీక్షలను రద్దు చేసినట్లు తెలుస్తోంది.దీనిపై సమగ్ర విచారణ కోసం ఈ కేసును సీబీఐకి అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టింది. అయితే కొత్తగా విద్యార్థుల రిజిస్ట్రేషన్ అవసరం లేదని ఎన్టీఏ చెప్పింది. అదనపు ఎగ్జామ్ ఫీజు కూడా అవసరం లేదని వెల్లడించింది. ప్రస్తుతం ఉన్న రిజిస్ట్రేషన్ డేటా, ఎగ్జామ్ సెంటర్లను యధావిధిగా కొనసాగించనున్నారు. గతంలో విద్యార్థులు చెల్లించిన ఫీజులను తిరిగి రిఫండ్ చేయనున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది.విద్యార్థుల ప్రయోజనం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తన ప్రెస్ రిలీజ్‌లో ఎన్‌టీఏ పేర్కొన్నది. జాతీయ పరీక్ష విధానంపై నమ్మకం సడలకుండా ఉండేందుకు మళ్లీ పరీక్షను నిర్వహిస్తున్నట్లు ఎన్‌టీఏ చెప్పింది. ఇది విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు ఇబ్బందిని కలిగించే అంశమే, కానీ జరిగిన పరిణామాల దృష్ట్యా మళ్లీ పరీక్ష నిర్వహించడమే ఉత్తమం అని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఎన్ఏటీ పేర్కొన్నది. ఒకవేళ ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్తే అప్పుడు నష్టం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని ఎన్టీఏ చెప్పింది. పరీక్ష తేదీ, అడ్మిట్ కార్డుకు సంబంధించిన అంశాల కోసం అధికారిక సమాచారాన్ని మాత్రమే ఫాలోకావాలని, సోషల్ మీడియాలో ప్రచారం అయ్యే అంశాలను పట్టించుకోవద్దు అని ఎన్టీఏ తెలిపింది

## గంగాధర క్షేత్రంలో ఘనంగా అష్టమ వార్షికోత్సవం



వాస్తవం : ఇల్లంతకుంట

ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన గంగాధర క్షేత్రంలో 'అష్టమ వార్షికోత్సవ' వేడుకలు మంగళ వారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేద పండి తులు, ఆలయ వ్యవస్థాపకుడు మూగు నాగరాజు శర్మ ఆధ్వ ర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, మహా చండీ హోమం, స్ఫటిక లిం గానికి విశేష ద్రవ్యాలచే అభి షేకాలను నిర్వహించారు. అనంతరం గంగాధర క్షేత్రంలోని మూగు దామోదర శర్మ అన్నదాన సత్రంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్ర మాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో ప్రముఖ పురోహితులు, వ్యవస్థాపకులు మూగు నాగరాజు శర్మ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# జైపూర్ మండలంలో కాంగ్రెస్ గ్రామ కమిటీల ఏర్పాటు

**వాస్తవం : జైపూర్**

కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలనే లక్ష్యంతో చెన్నూరు శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు జైపూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు పార్టీ మండల అధ్యక్షులు చల్ల విశ్వంబర్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు మండల కమిటీతో పాటు ప్రతి గ్రామంలో క్రియాశీలక కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ స్థాయిలో పార్టీ కార్యకలాపాలు వేగవంతం చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, స్థానిక సమస్యలపై ప్రజల గొంతుకగా నిలవడం గ్రామ కమిటీల ముఖ్య ఉద్దేశమని వివరించారు.గ్రామ కమిటీ అధ్యక్షుడు, కార్యదర్శి పదవులకు ఆసక్తి ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు మే 13, 2026 బుధవారం ఉదయం 10 గంటల నుంచి జైపూర్ మండల కేంద్రంలోని సాగర్ రావు హోటల్ వద్ద దరఖాస్తులు సమర్పించాలని చల్ల విశ్వంబర్ రెడ్డి కోరారు. దరఖాస్తు చేసుకున్న వారి నుంచి పార్టీకి క్రమశిక్షణతో పనిచేసే, ప్రజలతో మమేకమయ్యే అర్హులైన వారిని ఎంపిక చేసి గ్రామ కమిటీ అధ్యక్షుడు, కార్యదర్శులుగా నియమిస్తామని ఆయన వెల్లడించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సహకరించాలని పిలుపునిచ్చారు.



# ఆటో డ్రైవర్ ఆత్మహత్య

**వాస్తవం : ఎల్లారెడ్డిపేట**



ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామ శివారులో విషాద ఘటన చోటుచేసుకుంది. పాముల భాస్కర్ (45) అనే ఆటో డ్రైవర్ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమ వారం రాత్రి నుండి భాస్కర్ కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసు కున్న స్థితిలో ఆయన మృతదేహం కనిపించింది.తెలంగాణ రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల ఆర్థిక ఇబ్బందులు, ఉపాధి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పటివరకు 209 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో ప్రవేశాలకు విద్యార్థుల ఎంపిక

**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**



2026-27 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ పథకంలో భాగంగా పాఠశాలల్లో ప్రవేశాల కోసం మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన డ్రా పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేశారు. 3వ, 5వ, 8వ తరగతులలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన పరిశీలించి, గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎస్టీ కేటగిరీలో సీట్లకు తల్లిదండ్రుల సమక్షంలో డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా 3వ తరగతికి ముగ్గురు అబ్బాయిలు, ఒక అమ్మాయి, 5వ తరగతికి ఒక అబ్బాయి, ఒక అమ్మాయి, 8వ తరగతికి ఒక అబ్బాయిని ఎంపిక చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు త్వరలో కౌన్సిలింగ్ నిర్వహించి, సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించిన అనంతరం ప్రవేశాలు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, గిరిజన అభివృద్ధి శాఖ అధికారి సంగీత, తదితరులు పాల్గొన్నారు.

# జైపూర్ పవర్ ప్లాంట్‌లో వైద్య ఆరోగ్య అవగాహన



**వాస్తవం : జైపూర్**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. అనిత మంగళవారం జైపూర్ పవర్ ప్లాంట్‌లో వైద్య ఆరోగ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీపీ, డయాబెటిస్ వంటి అసంక్రమణ వ్యాధులు, క్యాన్సర్ రోగులను గుర్తించి అవగాహన కల్పించడంతో పాటు మందులు అందజేశారు. కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలు, వాతావరణ మార్పులతో వచ్చే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులపై జాగ్రత్తలు, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత, దోమలు పెరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కలిగించారు. 14 ఏళ్లు నిండిన బాలికలకు ఉచితంగా గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ముస్తాఫా, డాక్టర్ సింధూర, డాక్టర్ పద్మజ, సీహెచ్‌వో రాజిరెడ్డి, జైపూర్ పవర్ ప్లాంట్ అధికారులు, సిబ్బంది, సెక్యూరిటీ, పోలీసు సిబ్బంది, జైవైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

### సింగరేణి ఆర్ అండ్ ఆర్ సైడ్ డ్రైనేజీ వాటర్‌తో

# పంట పొలాలకు ముప్పు

**సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎంపీడీవో శైలజ రాణి**

**వాస్తవం : రామగిరి**



సింగరేణి ఆర్ అండ్ ఆర్ సైడ్ డ్రైనేజ్ వాటర్‌తో పంట పొలాలకు నష్టం వాటిల్లుతున్నదని మంథని ఆర్డిఓ కార్యాలయంలో ఈ నెల 4,తేదీన ప్రజావాణిలో రైతులు ఫిర్యాదు చేయడం చేశారు. రాంనగర్,సీటూ క్వార్టర్స్,పాత లద్నాపూర్ ఫ్లాట్స్, కొత్త ఫ్లాట్స్,డ్రైనేజ్ వాటర్‌ను రత్నాపూర్ ప్రభుత్వ స్కూల్ వద్దకు వదిలే విధంగా డ్రైనేజీ నిర్మాణానికి సింగరేణి సంస్థ టెండర్ పనులు పిలవడం జరిగింది.దీంతో పై నుండి వచ్చే డ్రైనేజీ వాటర్‌తో కింద ఉన్న పంట పొలాలకు ముప్పు వాటిల్లుతుం దని ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో మంగళవారం రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాల వద్ద డ్రైనేజీ వాటర్‌ను ఎంపీడీవో బద్రి శైలజ రాణితో పాటు గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమ పివి రావు,గ్రామ కార్యదర్శి సంతోష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శైలజ రాణి మాట్లాడుతూ పై నుండి వచ్చే సైడ్ డ్రైనేజ్ వాటర్‌తో పంట పొలాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పంటపొలాలకు నష్టం వాటిల్లకుండా కొంత మేరకు పట్టభూమి సేకరించి పూర్తిస్థాయిలో సింగరేణి సంస్థతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**మరొకరికి తీవ్ర గాయాలు**

**వాస్తవం : మనోహరాబాద్:**



మనోహరాబాద్ మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ కళ్ళకల్ జాతీయ రహదారిపై మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాసాపేటకు చెందిన కేతవత్ మనోహర్,విటల్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మనోహర్ 28" సం" అక్కడికక్కడే మృతి చెందగా,విట్టల్ 45"సం"కు తీవ్ర గాయాలయ్యాయి.ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేసి, విఠల్ ను ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి,మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపారు.

జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190
వాస్తవం

# ముఖ్యమంత్రి గారు..
# గండిపడిన రోడ్డును బాగుచేయరా?



మేరుగు రాజయ్య
9441440791



ప్రజాస్వామ్యం అంటే? ప్రజల చేత,ప్రజల కోసం,ప్రజలే ఎన్నుకునే ప్రభుత్వ విధానం. ప్రజలభాగస్వామ్యంతో చట్టబద్ధంగా కొనసాగే పాలననే ప్రజాస్వామ్యం. కాని ఆచరణలో మాత్రం ప్రజల సమస్యలను పరిష్కరించడానికి పాలన సాగడం లేదు.అందుకే ప్రజలు తమ సమస్యల పరిష్కారం గురించి నిరంతరమూ పాలకులకు,యంత్రాంగానికి విన్నపాలు చేయడం పరిపాటిగా జరుగుతూనే ఉంది.అలాగే ప్రభుత్వం ప్రజల విన్నపాలను చెత్తబుట్ట పాలు చేసి జవాబుదారీగా పనిచేయకపోవడం కూడా పరిపాటిగా జరుగుతూనే ఉంది.దాని వలన "పట్టు చీర అరవిచ్చి పీట పట్టుకుని వెనకాలె తిరిగినట్టు ఉంది"అన్న చందంగాప్రజాస్వామ్య పాలన సాగుతోంది. ఉత్తర తెలంగాణలో హుస్నాబాద్‌కు ప్రత్యేకత ఉందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు.ప్రజా పాలన విజయ వజ్రోత్సవాలలో భాగంగా 2025 డిసెంబర్ 3న హుస్నాబాద్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో హుస్నాబాద్, కరీంనగర్ ప్రాముఖ్యతను చాటి చెప్పారు.మలి దశ తెలంగాణ పోరాట తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి అమరుడైన డిసెంబర్3ను మననం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు సోనియా గాంధీ భరోసాను ఇచ్చింది కూడా కరీంనగర్ బహిరంగ సభలోనేనని గుర్తు చేశారు.మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కూడా హుస్నాబాద్‌ను అదృష్ట వేదికగా భావించారు. స్వరాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భావం అనంతరం 2018 డిసెంబర్ 7న జరిగిన శాసన సభ ఎన్నికల ప్రచారాన్ని సెప్టెంబర్ 7 న హుస్నాబాద్ నుండే ప్రారంభించారు.అలాగే 2023 నవంబర్ 30 న జరిగిన శాసన సభ ఎన్నికల ప్రచారాన్ని కూడా అక్టోబర్ 15న హుస్నాబాద్ నుండే ప్రారంభించి మేనిఫెస్టోను విడుదల చేశారు. హైదరాబాద్ స్టేట్ భారత్‌లో విలీనం అయిన 1948 సెప్టెంబర్ 17 అనంతరం 1952 లో జరిగిన ఎన్నికల్లో "నుస్తూలాపూర్" నియోజకవర్గం నుండి "పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ "అభ్యర్థిగా "సింగిరెడ్డి వెంకట్ రెడ్డి",1957లో "ఇందుర్తి "నియోజకవర్గం నుండి పీడీఎఫ్ అభ్యర్థిగా చామనపల్లి చొక్కారావు,1972లో సీపీఐ అభ్యర్థిగా బద్దం ఎల్లారెడ్డి, అసెంబ్లీ నియోజక వర్గాల పునర్విభజనలో భాగంగా 2009 ఏప్రిల్ 16,23 తేదీలలో జరిగిన శాసన సభ ఎన్నికల సమయమున హుస్నాబాద్ నియోజకవర్గంగా ఏర్పాటైంది.ఇప్పటి వరకు జరిగిన శాసన సభ ఎన్నికల్లో ఈ ప్రాంత నియోజక వర్గం నుండి ప్రతిపక్ష అభ్యర్థులు ఎనిమిది పర్యాయాలు, అధికార పక్ష అభ్యర్థులు ఏడు పర్యాయాలు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు.2023 నవంబర్ 30న జరిగిన ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి వొడితెల సతీష్ కుమార్ పై కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ 19,344 ఓట్ల మెజారిటీతో గెలుపొంది రాష్ట్ర రోడ్ల రవాణా,బీసీ సంక్షేమ మంత్రిగా సేవ చేస్తున్నారు. హుస్నాబాద్‌ను "భార్గవపురం"అనే పేరుతో పిలిచే వారని అంటుంటారు.అలాగే పెర్షియన్ భాషలో "హస్న్"అంటే అందం."అబాద్"అంటే స్థిరపడిన ప్రదేశం.అలా హుస్నాబాద్‌గా జనగొంతుకైందని చెపుతారు. హుస్నాబాద్‌కు 4 కిలోమీటర్ల దూరంలో మహమ్మాదాపూర్ కోటగిరి గుట్టల్లో "తెలంగాణ భగత్ సింగ్ గా పిలువబడిన "అనభేరి ప్రభాకర్ రావు"తో పాటుగా సింగిరెడ్డి భూపతి రెడ్డి,ఏలేటి మల్లారెడ్డి, అయిరెడ్డి భూంరెడ్డి, తూమేజు నారాయణ,ముస్కు చొక్కారెడ్డి,జి.దామోదర్ రెడ్డి, ఇల్లందుల పాపయ్య, పారెడ్డి రాంరెడ్డి,నల్లగొండ రాజారాం, సిక్కుడు సాయిల్,రొండ్ల మాధవ రెడ్డిలు నిజాం సైన్యం 1948 మార్చి 14న జరిపిన కాల్పుల్లో అమరులైనారు. అప్పటి పీపుల్స్ వార్ తమ అమరవీరుల స్మారకంగా 88 అడుగుల ఎత్తయిన స్థూపాన్ని హుస్నాబాద్‌లో నిర్మించి 1990 అక్టోబర్ 25న ఆవిష్కరణ చేసింది. ఆసియా ఖండంలో చైనాలోని తీయాన్ మెన్ స్క్వేర్ స్థూపం తరువాత అతి పెద్ద రెండవ స్థూపంగా హుస్నాబాద్‌కు ఉంది.దాదాపు పదేండ్ల తరువాత "గ్రీన్ టైగర్స్"పేర స్థూపాన్ని కూల్చివేశారు. ఇప్పుడు హుస్నాబాద్ కొత్తగా కనిపిస్తున్నది.సిద్దిపేట బైపాస్ రోడ్డులోని" తెలంగాణ అమరవీరుల స్థూపం" నుండి హుస్నాబాద్ రోడ్డుపై 40కిలోమీటర్లు ప్రయాణించి ఎల్లమ్మ చెరువు మత్తడి ఒర్రే దాటిన పిదప డివైడర్‌తో నిర్మించిన విశాలమైన రోడ్ కనిపిస్తున్నది.డివైడర్ మధ్యలో విలువైన "క్రీడాకారుల విగ్రహాలు"కనిపిస్తున్నాయి. హుస్నాబాద్ మహర్దశకు కారణం ఏమిటని ఆరా తీస్తే ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి 2025 డిసెంబర్ 3న జరిగిన "ప్రజా పాలన విజయ వజ్రోత్సవాలలో భాగంగా అభివృద్ధికి విడుదల చేసిన రూ.262.78 కోట్లు నిధులని తేలింది. ఇంజనీరింగ్ కాలేజీకి రూ.44.15 కోట్లు, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఎటీసీ)కు రూ.45.15 కోట్లు, హుస్నాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.20 కోట్లు,రోడ్ ట్రాన్స్ పోర్ట్ అథారిటీ (ఆర్టీఎ) కార్యాలయానికి రూ.8.60 కోట్లు,రాజీవ్ రహదారి కొత్తపల్లి నుండి హుస్నాబాద్ కు నాలుగు లైన్ల రోడ్డుకు రూ.86 కోట్లు, హుస్నాబాద్ నుండి అక్కన్నపేటకు నాలుగు లైన్ల రోడ్డుకు రూ.58.91 కోట్లు, తెలంగాణలోనే తొలి" గ్లాస్ బ్రిడ్జిని" ఎల్లమ్మ చెరువులో నిర్మించడానికి రూ.18 కోట్లు,చెరువు నీళ్ల మధ్యన వంతెన నిర్మాణంకు రూ.5 కోట్లు, హుస్నాబాద్ నుండి పందిళ్ల వరకు రోడ్డు నిర్మాణంకు రూ.23 కోట్లు,ఎల్లమ్మ చెరువు సుందరీకరణకు రూ.18 కోట్లు,గతంలో ఒడితెల సతీష్ కుమార్ ఎమ్మెల్యేగా ఎల్లమ్మ చెరువు సుందరీకరణ గురించి రూ.7 కోట్లు మంజూరైనట్లుగా ,అందులో రూ.2 కోట్లు ఖర్చు చేసినట్లుగా చెప్పినారు.మినీ స్పోర్ట్స్ హాల్ కు రూ.45 లక్షలు,యిలా రూ.262.78 కోట్ల నిధులను ఖర్చు చేసి హుస్నాబాద్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం చెబుతోతుంది. హుస్నాబాద్‌కు నాలుగు లైన్ల రోడ్డు నిర్మించాలని,ఎల్లమ్మ చెరువును సుందరీకరణ చేయమని ప్రజలెవరూ ప్రభుత్వానికి విన్నపాలు చేయలేదు. ప్రభుత్వమే అభివృద్ధి పేర తమకు లాభదాయకమైన పనులకు వందల కోట్లు ఖర్చు చేసి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుచున్నారు. స్వరాష్ట్రం తెలంగాణలో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను నివేదించుకోవడానికి ప్రతి శాసన సభ నియోజకవర్గంలో వందల కోట్లు వెచ్చించి ఎమ్మెల్యే కార్యాలయాలను నిర్మించారు. కాని ఆచరణలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలుగా ఎమ్మెల్యేల కార్యాలయాలు పని చేయలేదు.దానితో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ప్రజా పాలనను సాగించలేదన్న అపవాదును మూటగట్టుకుంది. దానితో కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో "ఆరు గ్యారంటీలతో పాటుగా ప్రజా పాలనను ప్రధాన అజెండాగా ప్రచారం చేసింది.ప్రజా పాలన అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచింది.కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు,మంత్రులు ఇతర పార్టీల కంటే భిన్నంగా, ఆదర్శంగా ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయడం లేదు.తమ బంధువునో, కుటుంబ సభ్యుడినో,తమ కులపొన్నో ఏజెంటుగా పెట్టుకుని వచ్చిన నిధులను ఎక్కడ ఖర్చు పెడితే లాభం వస్తుందో పక్క ప్రణాళికతో పనులు చేసుకుంటున్నారు.మండల,జిల్లా ప్రభుత్వ యంత్రాంగంలోని అధికారులను, సిబ్బందిని అనుకూలంగా మలుచుకుంటున్నారు. హుస్నాబాద్‌కు 13 కిలోమీటర్ల దూరంలో "దుద్దెనపల్లి" గ్రామం ఉంటుంది. సరిహద్దు గ్రామాలుగా మండల కేంద్రం సైదాపూర్,ఎగ్లాస్‌పూర్,బొమ్మనపల్లి,రేకొండ, శివరాం పల్లె, పెరుకపల్లె,ఆకునూర్ లు హుస్నాబాద్ శాసన సభ నియోజకవర్గం పరిధి గ్రామాలే. తెలంగాణాలో గ్రామాల ఆవిర్భావాన్ని పరిశీలించినట్లయితే ప్రతి మూడు నుండి ఆరు కిలోమీటర్లకు ఒక ఊరు ఉంటుంది.అట్లాగే హుస్నాబాద్ నియోజకవర్గంలోని దుద్దెనపల్లి ,మానకొండూరు నియోజకవర్గంలోని మొగిలిపాలెం మధ్యన ఒక రోడ్ ఉంది.ఈ రోడ్ మీదుగా కరీంనగర్ నుండి హుస్నాబాద్ వరకు ప్రవేటు బస్ సర్వీస్‌లు కూడా నడిచినవి.ఇప్పుడు మొగిలిపాలెం నుండి మానకొండూరుకు, తాడికల్ కరీంనగర్ హుజురాబాద్ రోడ్డుకు, నల్గొండ పర్లపల్లి, నుస్తులాపూర్ రాజీవ్ రహదారి రోడ్డుకు,రేకొండ, చిగురుమామిడి, హుస్నాబాద్ కు తారు/డాంబర్ రోడ్ సౌకర్యం ఉంది. కాని దుద్దెనపల్లికి మొగిలిపాలెం గ్రామాల మధ్య కనీసం "మొరం రోడ్"సౌకర్యం కూడా లేదు.దుద్దెనపల్లి ప్రక్కన "పదాల/పెద్ద చెరువు" ఉంది.దాని మత్తడి నీళ్లు దుద్దెనపల్లి మొగిలిపాలెం గ్రామాల మధ్యన ఉన్న దారి/మొరం రోడ్ ప్రక్క నుండి 200 మీటర్లు ప్రవహించిన నీరు గొలుసుకట్టు చెరువులైన రేణీకుంట, శీలవాణి కుంట,నాగుల,దేవుని చెరువులకు పోతాయి.అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో 2010 లో "పనికి ఆహార పథకం"కింద దుద్దెనపల్లి నుండి మొగిలిపాలెం పోయే దారిని మొరం రోడ్‌గా,పదాల చెరువు మత్తడి నీళ్లు ప్రవహించడానికి "సిమెంటు పైపుల కల్వర్టును" నిర్మించారు.2020లో కురిసిన భారీ వర్షాలకు పదాల చెరువు మత్తడి నీళ్ల ప్రవాహానికి మొరం రోడ్, కల్వర్టుకు గండి పడింది.ఇక 2025 లో కురిసిన భారీ వర్షాలకు దారి/రోడ్ ఆనవాళ్లు లేకుండా గండ్లు పడి మొత్తం దారినే బంద్ అయింది.రైతులు పొరుగు గ్రామాలైన ఎగ్లాస్‌పూర్,రేకొండ గ్రామాల మీదుగా 8 కిలోమీటర్లు ప్రయాణించి వ్యవసాయ పనులను సక్కబెట్టు కుంటున్నారు.కైకిలోళ్లను/కూలీలను ఆటో,ట్రాక్టర్ల మీద ప్రయాణించుకుని పోయి ఆర్థిక భారాన్ని భరించుచున్నారు. దుద్దెనపల్లి ముడాగుల మొగిలిపాలెం రోడ్డును మరమ్మతులు చేసి కల్వర్టును నిర్మించాలని అప్పటి బిఆర్ఎస్ ఎమ్మెల్యే ఒడితెల సతీష్ కుమార్‌కు,సంబంధిత అధికారులకు విన్నవించుకున్నారు.గ్రామ సర్పంచ్,ఎంపీటీసీ,రైతుల సంతకాలతో కూడిన "విజ్ఞాపన పత్రాన్ని"2022 నవంబర్ 14 నాటి కరీంనగర్ జిల్లా కలెక్టర్ ప్రజావాణిలో ఇవ్వగా జిల్లా పంచాయితీ రాజ్ కార్యానిర్వాహక ఇంజనీర్‌కు రిఫర్ చేశారు.దానితో హుజురాబాద్ సబ్ డివిజన్,సైదాపూర్ మండలం పంచాయితీ రాజ్ ఇంజనీర్‌లు 2023 జనవరి 17 న పదాల చెరువు మత్తడి నీళ్ల ప్రవాహానికి గండి పడిన కల్వర్టును,కోతకు గురైన మొరం రోడ్డును అధ్యయనం చేసి రూ.78.50 లక్షల (డెబ్బై ఎనిమిది లక్షల యాభై వేలు)బడ్జెట్ రిపోర్టును జిల్లా కలెక్టర్ కు నివేదించారు.బడ్జెట్ కేటాయింపచేసి గండి పడిన కల్వర్టును,రోడ్ ను పునః నిర్మించాలని జిల్లా కలెక్టర్,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి,సంబంధిత మంత్రిత్వ కార్యదర్శులకు,మంత్రులకు వినవించిన గాని అడుగు ముందుకు పడలేదు.2023 నవంబర్ 30 న జరిగిన శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.హుస్నాబాద్‌లో కూడా కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యేగా గెలవడంతో పాటుగా రాష్ట్ర రోడ్ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా కూడా ప్రభుత్వంలో భాగస్వామ్యమైనారు.మంత్రి అనుచరులు గత ఏడాదిగా మొగిలిపాలెం ముడాగుల రోడ్డు నిర్మాణంకు బడ్జెట్ కేటాయింపు జరుగుతుందని ఊరిస్తూ వచ్చారు.ఇప్పుడేమో "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి" టేబుల్ మీద బడ్జెట్ ఫైల్ ఉందని అంటున్నారు.మేము సామాన్యమైన ప్రజలం, రైతులం మీ దగ్గరకు వచ్చి విన్నవించుకునే రాజకీయ స్థాయిలో మేము లేము.మాకు అందుబాటులో ఉండే ప్రభుత్వ యంత్రాంగానికి రాత పూర్వకంగా విన్నవించుకున్నాము.జిల్లా కలెక్టర్,పంచాయితీ రాజ్ ఇంజనీర్‌లు రోడ్డు నిర్మాణం అవశ్యకతను, దానికి ఖర్చు పెట్టవలసిన బడ్జెట్ ను నివేదించారు.అయిన గాని గత మూడు సంవత్సరాలుగా బడ్జెట్ కేటాయింపును పెండింగ్ లో పెట్టారు.నిత్యం ప్రయాణించే రహదారి/రోడ్డు బంద్ అయితే రైతులు, వ్యవసాయ కూలీలు,ప్రజల ప్రయాణ ఇబ్బందులు రైతు బిడ్డగా మీకు తెలియనిది కాదు.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243(బి) 73వ, రాజ్యాంగ సవరణ మార్గదర్శకంగా రూపొందించినపంచాయితీ రాజ్ చట్టం 1992 ప్రకారం రాజ్యాంగ హోదా కలిగిన "దుద్దెనపల్లి గ్రామ సభలో మొగిలిపాలెం ముడాగుల రోడ్డు నిర్మాణం చేయాలని ఆమోదించి ప్రభుత్వానికి నివేదించాము.ఈజ్ మెంట్ ఆక్ట్ 1882,సెక్షన్ 13 ప్రజలకు రహదారి సౌకర్యాలు ఉండాలని చెపుతుంది.చెరువు మత్తడి నీళ్ల ప్రవాహంతో కొట్టుకుపోయిన,గండిపడిన రోడ్డును, కల్వర్టును పునః నిర్మాణం చేయాలని ప్రజలుగా ప్రభుత్వ యంత్రాంగానికి, సంబంధిత చట్ట సభల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశాము.ప్రజా పాలనతో సమస్యలను పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రిగా మీరు కూడా చొరవ చూపి దుద్దెనపల్లి మొగిలిపాలెం ముడాగుల రోడ్డు నిర్మాణం చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

**అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో 2010 లో "పనికి ఆహార పథకం"కింద దుద్దెనపల్లి నుండి మొగిలిపాలెం పోయే దారిని మొరం రోడ్‌గా,పడాల చెరువు మత్తడి నీళ్లు ప్రవహించడానికి "సిమెంటు పైపుల కల్వర్టును"నిర్మించారు.2020లో కురిసిన భారీ వర్షాలకుపడాల చెరువు మత్తడి నీళ్ల ప్రవాహానికి మొరం రోడ్, కల్వర్టుకు గండి పడింది.ఇక 2025 లో కురిసిన భారీ వర్షాలకు దారి/రోడ్ ఆనవాళ్లు లేకుండా గండ్లు పడి మొత్తం దారినే బంద్ అయింది.రైతులు పొరుగు గ్రామాలైన ఎగ్లాస్‌పూర్,రేకొండ గ్రామాల మీదుగా 8 కిలోమీటర్లు ప్రయాణించి వ్యవసాయ పనులను సక్కబెట్టు కుంటున్నారు.**



# కార్మికులు ఆందోళన చెందవద్దు

### సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ కట్టుబడి ఉంది అర్జీ-3,ఏపీఏ ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి




**వాస్తవం : రామగిరి**

సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ నిరంతరం కృషి చేస్తోందని అర్జీ–3, ఏపీఏ ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి తెలిపారు.ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్,రాష్ట్ర మినిమం వేజ్ బోర్డ్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ బి.జనక్ ప్రసాద్ నాయకత్వంలో రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి,అలాగే సింగరేణి సంస్థ సీ అండ్ ఎండి ని కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఆందోళనలు,సమస్యలు,సంస్థ అభివృద్ధికి సంబంధించిన అంశాలను సుదీర్ఘంగా వివరించినట్లు చెప్పారు.దీనికి స్పందించిన రాష్ట్ర మంత్రులు,సీఎం సలహాదారులు,సీ అండ్ ఎండి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మెడికల్ బోర్డు వ్యవహారంలో జరిగిన అవకతవకలను ప్రస్తావిస్తూ,అన్ఫిట్ పేరుతో కార్మికుల నుండి లక్షల రూపాయలు వసూలు చేసిన పరిస్థితులు పునరావృతం కాకుండా నిజాయితీగా వ్యవస్థ కొనసాగించాలని కోరినట్లు చెప్పారు.అదేవిధంగా పెరెక్స్‌పై ఐటీని సింగరేణి సంస్థ నుండే చెల్లించడం,సొంతింటి కల సమస్యల పరిష్కారం,కొత్త గనులు ప్రారంభించకపోవడం వల్ల బొగ్గు ఉత్పత్తి తగ్గిపోతున్న నేపథ్యంలో వెంటనే కొత్త బొగ్గు గనులు ప్రారంభించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు.కార్మికులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కోట రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు వుయ్యాల కుమారస్వామి, జిఎం కమిటీ సభ్యులు ఎల్లంకి రావు, పిట్ కార్యదర్శులు రామిడ్ల మనోహర్,కెఎన్ చారి,ఎనగందుల సదానందం, రెసిడెంటల్ కమిటీ సభ్యులు బుద్దే సదానందం,సోషల్ మీడియా ఇంచార్జి మేకల మారుతి యాదవ్,నాయకులు అర్జున్,ఇంద్రసేన రెడ్డి,సతీష్ రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# అగ్నికి రైతు బలి

**వాస్తవం : లక్ష్మణ చందా**

కనకాపూర్ గ్రామానికి చెందిన రైతు మంద గంగన్న మంగళవారం ఉదయం 10:30 గంటలకు సమయంలో తన చేనులో వృథాగా పడి ఉన్న మొక్క కర్రలకు నిప్పు పెట్టగా అది ఒకేసారి చెలరేగి పక్కకు ఉన్న వరి పంటల వైపు మంటలు వెళ్లగా ఒకేసారి అది కాలిపోతుంది ఏమో అన్న భయభ్రాంతులకు గురి అయ్యి అవి ఆర్పి వేసే క్రమంలో ప్రమాదవశాత్తు తన శరీరానికి నిప్పు అంటుకొని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి ముగ్గురు కూతుర్లు. మృతుని భార్య రాజమణి ఫిర్యాదు మేరకు లక్ష్మణ్ చందా ఎస్సై శ్రావణి సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# టిఆర్ఎస్‌లో భారీగా చేరికలు

**వాస్తవం : ఎల్లారెడ్డిపేట:**



పార్టీలో చేరడమే కాకుండా ప్రజలకు సేవలు చేయడానికి ముందుండాలని టిఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలకు టిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల కవిత కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల నుండి మంగళవారం హైదరాబాద్‌లోని టిఆర్ఎస్ భవనంలో టిఆర్ఎస్ నాయకులు వరద సతీష్, కదిరే భాస్కర్ గౌడ్ ద్వారా సయ్యద్ జావిద్ ఆధ్వర్యంలో 150 మంది తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. అందరికీ టిఆర్ఎస్ కండువాలు కప్పి కవిత పేరుపేరునా పలుకరిస్తూ పార్టీలోకి ఆహ్వానించారు.పార్టీలో చేరికలైన వారందరూ తమ తమ గ్రామాలలో, వీధులలో ప్రజలకు ఉన్న సమస్యలను వెలికి తీసి పాలకుల, అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు సేవలు అందించాలని కోరారు. త్వరలోనే గ్రామ గ్రామాన టిఆర్ఎస్ జెండా పండుగలు నిర్వహించాలని అన్నారు. రాష్ట్ర ప్రజలకు సేవలు చేయడానికే టిఆర్ఎస్ పార్టీని స్థాపించడం జరిగిందని, ప్రజలందరూ టిఆర్ఎస్‌ను ఆదరించాలన్నారు.

### హనుమాన్ భక్తుల సేవలో మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్



**వాస్తవం: వేములవాడ**

హనుమాన్ జయంతి సందర్భంగా పాదయాత్ర చేసే హనుమాన్ భక్తులకు మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో రెండు రోజులపాటు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర చేసే భక్తులకు మంగళవారం మ్యాంగో జ్యూస్, చల్లని నీరు, అరటి పండ్లు అందించడం జరిగిందని ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ మధు మహేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ బెజ్జంకి రవీందర్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, నంది సాయి కుమార్, పసుల శ్రీనివాస్, మధు కవిత, లక్ష్మణ్, బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

# వేసవి జాగ్రత్తలు పాటిస్తూ పనులు చేపట్టాలి

### ఎంపీడీవో బద్రి శైలజ రాణి

**వాస్తవం : రామగిరి**



మండలంలోని రామగిరి ఖిల్లా ప్రాంతంలో కొనసాగుతున్న ఈజీఎస్ పనులను మంగళవారం ఎంపీడీవో బద్రి శైలజ రాణి,రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా పనుల పురోగతి, కార్మికుల హాజరు, మౌలిక సదుపాయాలు తదితర అంశాలను ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో కూలీలు తగిన జాగ్రత్తలు పాటిస్తూ పనులు నిర్వహించాలని ఆమె సూచించారు.మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రంగా ఉండటంతో తాగునీరు,నీడ,ప్రథమ చికిత్స సదుపాయాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.పనుల నాణ్యతలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆమె పేర్కొన్నారు. కూలీల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి పని స్థలంలో భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలని తెలిపారు.అనంతరం వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాది ఏపీఎం వి.మౌనిక, సెక్రటరీ గంగుల సంతోష్,టీ.ఏ ఎం.అఖిల,ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్.జ్యోతి కుమార్ పాల్గొన్నారు.

# బస్సు కోసం రాస్తారోకో



**వాస్తవం : ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలం పెద్ద లింగాపూర్ గ్రామంలో గ్రామస్తులు మంగళ వారం రోజున రోడ్డుపై బైఠాయించారు. సిరిసిల్ల డిపో బస్సు గతం లో లాగే జిల్లెల్ల దాచారం పెద్దలింగాపూర్ నుండి ఇల్లంతకుంట వచ్చేదని దాని పెద్దలింగాపూర్ నుండి నడపాలని డిమాండ్ చేశారు.అధికారులు రూట్ సర్వే పేరుతో కాల యాపన చేస్తున్నారని గ్రామస్తులు మండి పడ్డారు బస్సు రద్దుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బస్సు సర్వీస్‌ను వెంటనే పునరుద్ధరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్స్ సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్స్ హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

# సంక్షేమానికి సర్కారు పెద్దపీట

**ఎమ్మెల్యే కవ్వంపల్లి**

**వాస్తవం : శంకరపట్నం**



బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శంకరపట్నం మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం మండలానికి సంబంధించిన 73 మందికి కళ్యాణ లక్ష్మి,51 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని అందుకే ఆ దిశగా కృషి సాగిస్తున్నదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు లబ్ధి పొందుతున్నారని ఆయన చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 25 పర్యాయాలు సీఎం ఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిందని ఆయన తెలిపారు. 25వ విడతలో శంకరపట్నం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 51 మందికి 13,48,000 రూపాయల విలువ చేసే చెక్కులను పంపిణీ చేసినట్టు ఆయన వివరించారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతున్న ప్రజా ప్రభుత్వానికి ప్రజలంతా అండగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సురేఖ, ఇంచార్జ్ ఎంపీడీవో ప్రభాకర్,మాజీ జడ్పీటీసీ, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, డిసిసి కార్యదర్శి గట్టు తిరుపతి గౌడ్, మండల సర్పంచ్ ఫోరం చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, ఉప సర్పంచుల ఫోరం చైర్మన్ గొట్టె మధు, సర్పంచులు చింతిరెడ్డి పద్మ, రాజేంద్రప్రసాద్, దుర్గం తిరుపతి, పార్టీ నాయకులు ఊకంటి మధుకర్, గాజుల మహేష్, కన్నబోయిన జంపయ్య, ఆడితం కుమార్, కాటం రవీందర్ రెడ్డి, మొలంగూరు సదానందం,ఏ రమేష్, జనగాం రాజయ్య, ఆడెపు అజయ్, షారుక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు క్రీడా వసతులపై దృష్టి

**జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి**



**వాస్తవం : రాజేంద్రనగర్**

ప్రజలకు మరింత మెరుగైన క్రీడా వసతులు కల్పించడంపై దృష్టి సారించామని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో క్రీడా ప్రాంగణాలు, పార్కులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన క్రీడా, వినోద సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందుకు అనుగుణంగా అనువైన ప్రదేశాలను గుర్తించి తదుపరి కార్యాచరణ, ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. క్రీడా ప్రాంగణాల స్థితిగతులను పరిశీలించి అభివృద్ధి చెందలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. జోనల్ పరిధిలో ప్రజలకు మౌలిక వసతులతో పాటు క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డిసి సురేందర్ రెడ్డి, ఎస్ ఈ నరేందర్ గౌడ్, డిఈఈ యాదయ్య, అధికారులు పాల్గొన్నారు.

# పశువుల అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

**- బక్రీద్ పండుగ వరకు పూర్తి నిషేధం**

**- చర్ల సీఐ ఏ.రాజు వర్మ వెల్లడి**

**చర్ల : వాస్తవం**

మండలంలో ఎవరైనా పశువులను అక్రమ రవాణా చేస్తే సహించేది లేదని చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చర్ల సీఐ ఏ.రాజు వర్మ హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో పశుసంవర్ధక శాఖ అధికారులు, మేజర్ గ్రామపంచాయతీ అధికారులు, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, పశువుల వ్యాపారులతో పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన సమావేశంలో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు వచ్చే బక్రీద్ పండుగను పురస్కరించుకొని మండలంలో ఏ ప్రాంతం నుండైనా పశువులను అక్రమ రవాణా చేయడం పూర్తిగా చట్ట విరుద్ధమని, నిషేధమని స్పష్టం చేశారు. బక్రీద్ పండుగ అనంతరం పశువుల వేలంపాట నిబంధనలు పాటిస్తూ, సరైన పత్రాలతోనే పశువుల రవాణా చేయవలసి ఉంటుందని సూచించారు.అక్రమంగా పశువుల క్రయవిక్రయాలు జరిపి అక్రమ రవాణా చేసేవారి పట్ల పశుసంవర్ధక శాఖ అధికారులు, చర్ల మేజర్ గ్రామపంచాయతీ అధికారులు, సర్పంచ్, పాలకవర్గం, సిబ్బంది దృష్టి సారించి పోలీస్ శాఖతో సమన్వయం చేసుకునేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు. వీటికి విరుద్ధంగా బక్రీద్ పండుగ వరకు ఎవరైనా వ్యవహరించినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాలని ప్రయత్నిస్తే శిక్షారులు అవుతారని అన్నారు. శాంతి భద్రతలను కాపాడడంలో ప్రజలు



పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో ఎస్సైలు ఆర్ నర్సిరెడ్డి, పి కేశవ్, మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి తోకల సురేష్, సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి డాక్టర్ కే సుధారాణి, అసిస్టెంట్ హరికాంత్, పలువురు పశువుల వ్యాపారులు పాల్గొన్నారు.

# బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

**వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ**



**వాస్తవం : వేములవాడ**


బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బిగితే సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశించారు. వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ మహేష్ బి గితే ఆకస్మిక తనిఖీ చేసి స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, రికార్డులను సమగ్రంగా పరిశీలించి ,కేసుల దర్యాప్తులో ఎటువంటి అలసత్వం ప్రదర్శించకుండా, పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి,చట్టపరంగా నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ వెంట వేములవాడ డిఎస్పీ శ్రీనివాసులు, సిఐ శ్రీనివాస్, ఎస్ఐ వెంకట్రాజం, సిబ్బంది ఉన్నారు.

# మైత్రివనంలో పనులను పర్యవేక్షించిన మంత్రి తుమ్మల

**వాస్తవం : జూబ్లీహిల్స్**



రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి దృక్పథం సహకారంతో అమీర్‌పేట్ మైత్రివనం చౌరస్తాలో నూతనంగా నిర్మించనున్న మహానటుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామ రావు విగ్రహ ప్రతిష్టాపన పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ అభ్యర్థన మేరకు మంగళవారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మైత్రివనం చౌరస్తా వద్ద చేపట్టనున్న ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్టాపన పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్ విగ్రహాన్ని అమీర్‌పేట్ లోని మైత్రివనం ప్రాంతంలో ప్రతిష్టించడం గర్వకారణమని తెలిపారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో నగర అభివృద్ధితో పాటు మహనీయుల స్ఫూర్తిని భావితరాలకు చేరవేసే కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ సంఘం చైర్మన్ బండి రమేష్ , కమ్మ సంఘం నాయకులు, జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని వివిధ డివిజన్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిహెచ్ఎంసి అధికారులు,స్థానిక నాయకులు , ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

# తెలంగాణ గౌడ యువజన సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కత్తి చిరంజీవి గౌడ్

**వాస్తవం : వర్ధన్నపేట**

తెలంగాణ గౌడ యువజన సంఘం వరంగల్ జిల్లా (రూరల్) నూతన అధ్యక్షుడిగా వర్ధన్నపేట మండలం, చెన్నారం గ్రామానికి చెందిన కత్తి చిరంజీవి గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టు నరేష్ గౌడ్ అధికారిక నియామక పత్రాన్ని జారీ చేశారు. గౌడ యువతను సంఘటితం చేయడంలో చిరంజీవి గౌడ్ చేస్తున్న కృషిని గుర్తించి రాష్ట్ర కమిటీ ఈ బాధ్యతలను అప్పగించింది.రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు, జిల్లాలో సంఘం బలోపేతానికి, కుల బాంధవుల సమస్యల పరిష్కారానికి చిరంజీవి గౌడ్ నాయకత్వం దోహదపడుతుందని రాష్ట్ర కమిటీ ఆశాభావం వ్యక్తం చేసింది. గౌడ జాతి అభ్యున్నతికి ఆయన నిరంతరం శ్రమిస్తారని రాష్ట్ర నాయకత్వం విశ్వాసం వ్యక్తం చేసింది.ఈ సందర్భంగా వరంగల్ జిల్లా (రూరల్) అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన కత్తి చిరంజీవి గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు గట్టు నరేష్ గౌడ్‌కు మరియు రాష్ట్ర కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



అతి త్వరలోనే జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉత్సాహవంతులైన గౌడ యువకులతో పూర్తి స్థాయి జిల్లా కమిటీని ఏర్పాటు చేస్తానన్నారు. జిల్లాలోని గీత కార్మికులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలపై, అలాగే గౌడ జాతి హక్కుల సాధన కోసం క్షేత్రస్థాయిలో పోరాడుతానన్నారు.

# బండి సంజయ్‌ను కేంద్ర మంత్రి వర్గం నుంచి తొలగించాలి

**వాస్తవం : అడ్డగూడూరు :**



మైనర్ బాలికను లైంగిక వేధింపులకు గురిచేసిన కేంద్ర హో?ం శాఖ మంత్రి బండి సంజయ్ కొడుకు బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని, బండి సంజయ్ ను మంత్రి వర్గం నుంచి తొలగించాలని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. బాధితులు పోలీస్ స్టేషన్ ఆశ్రయించిన ఇప్పటి వరకు బండి భగీరథపై కేసు నమోదు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. బాధితులను బెదిరించడం కాకుండా సాక్షాలను దాచి పెట్టేందుకు ప్రయత్నించినా బండి సంజయ్, సంగప్ప పై కేసు నమోదు చేయాలని, తండ్రిని అడ్డం పెట్టుకొని అనేక నేరాలకు పాల్పడుతున్న బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మైనర్ బాలికకు న్యాయం జరిగే వరకూ బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య, పూలపల్లి జనార్దన్ రెడ్డి, మందుల కిరణ్, పూజారి సైదులు, గజ్జెల్లి రవి, గూడెపు పరమేష్, దాసరి బాలరాజు, పయ్యావుల రమేష్, గంగయ్య, రామకృష్ణ, బాబురావు, నరేష్, మహేష్, మత్స్యగిరి , నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో మహిళల భద్రత ప్రశ్నార్థకం

**మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతా రెడ్డి**

**వాస్తవం : శేరిలింగంపల్లి :**

రాష్ట్రవ్యాప్తంగా సంచనం రేపిన ఫోక్స్ కేసు ఘటనపై కాంగ్రెస్ బిజెపి వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం చందానగర్ శేర్లింగంపల్లి నియోజకవర్గం టీఆర్ఎస్ శ్రేణులు భారీ నిరసన చేపట్టారు. చందానగర్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో బాలికకు వెంటనే న్యాయం చేయాలని, ఘాతకానికి పాల్పడిన బండి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలంటూ టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ముంబై జాతీయ రహదారిపై బైఠాయించి రోడ్డును దిగ్బంధించారు. ఈ సందర్భంగా బొబ్బ నవత రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ బిజెపి రాజకీయ నాటకాలు ఆపాలని బాలికకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు .తెలంగాణలో మహిళల భద్రత ప్రశ్నార్ధకంగా మారిందని దోషులను కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రోజా ,మమత, నాగమణి ,వాళ్ళ హరీష్ ,మిద్దెల మల్లారెడ్డి ,సంతోష్ రెడ్డి, రామకృష్ణ గౌడ్, గోప్రాజు శ్రీనివాస్ ,శివరాజ్, పారణాంది శ్రీకాంత్, వంశీ ,వడ్డే రాజు జహంగీర్ బిఎస్ఎన్ కిరణ్ యాదవ్, పొట్ట నరేందర్ యాదవ్, బాబు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.




## నీటిలో మునిగి
# కాడెద్దు మృతి

**వాస్తవం : అడ్డగూడూరు :**

చెక్ డ్యామ్ నీటిలో మునిగి కోడె( కాడెద్దు) మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చిన్నపడిశాల గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం... చిన్న పడిశాల గ్రామానికి చెందిన రైతు గోడిశాల సోమయ్య తండ్రి నారయ్య రోజువారీగా తన గోవులు, కాడెద్దులను మేతకు తోలుకొని వెళ్లి మేపుతుండగా బిక్కేరువాగులోని చెక్ డ్యామ్‌లో కోడె నీళ్లు త్రాగడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయిందని రైతు కన్నీరు మున్నీరుగా విలపించాడు.కోడె విలువ సుమారు 80000 వేల రూపాయలు ఉంటుందని తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.



# కోతుల వీరంగం



**వాస్తవం : చిగురుమామిడి:**

మండలంలోని నవాబుపేటలో మంగళవారం కోతులు స్వైర విహారం చేశాయి.గ్రామానికి చెందిన అనుమాన్ల నరసయ్యపై కోతులు తన ఇంటి వద్ద దాడి చేసి తీవ్రంగా కరచి గాయపరిచాయి.అయితే గత రెండు రోజుల క్రితం నవాబుపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ పాలకవర్గం ఆధ్వర్యంలో కోతులను పట్టించగా కోతులను పట్టేవారు పూర్తి స్థాయిలో కోతులను పట్టుకొని తీసుకెళ్ళకపోయారు. పిల్ల కోతులు మాత్రమే పట్టుకోగా తల్లి కోతులు గ్రామంలో వివిధ కాలనీల్లో తీవ్రం అరుస్తూ గ్రామస్తులపై దాడులు చేస్తున్నాయి.దీంతో గ్రామస్తులు బయటకు రోడ్లపైకి రావాలంటే భయాందోళన చెందుతున్నారు.కోపంలో కోతులు వచ్చి దాడిచేసే అవకాశం ఉందని గ్రామ పంచాయతీ పాలకవర్గం చొరవ తీసుకొని మిగిలిన కోతులను కూడా పట్టించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


# భూభారతి ఆపరేటర్ కొరతతో దరఖాస్తుదారులకు ఇబ్బందులు

**చందుర్తి తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు పెండింగ్**

**వాస్తవం : చందుర్తి**

చందుర్తి మెజిస్ట్రేట్, రిజిస్టర్ తహసిల్దార్ కార్యాలయంలో భూభారతి ఆపరేటర్ లేనందువల్ల దరఖాస్తుదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని భూమి క్రయ విక్రయ, వారసత్వంగా పట్టా మార్పిడికి మీ సేవలో దరఖాస్తు చేసుకోగా తహశీల్దార్ కార్యాలయానికి సరైన సమయానికి దరఖాస్తుదారులు వచ్చినప్పటికీ భూభారతి ఆపరేటర్ లేకపోవడంతో వెనుతిరుగుతున్నారు.చందుర్తి, రుద్రంగి రెండు మండలాలకు ఒకే భూభారతి ఒక ఆపరేటర్ ఉండడంతో దరఖాస్తుదారుల పని కాలేక ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూమి కొనుగోలు, పట్టా మార్పిడికి దరఖాస్తు చేసుకునే దరఖాస్తుదారుల పని లేక సమయం వృధా అవుతుందని అంటున్నారు. జిల్లా అధికారుల స్పందించి మండలానికో భూభారతి ఆపరేటర్‌ను నియమించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి




**వాస్తవం : రాజేంద్రనగర్**

హనుమాన్ జయంతి వేడుకలు రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో బుద్వేల్ గ్రీన్ సిటీ, నార్సింగ్ మంచిర్యాల గ్రామంలోని శ్రీ భక్త వీరాంజనేయ స్వామి దేవాలయంలో అంగరంగ వైభవంగా జరిగాయి. జయంతి ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ఇన్చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలుపుతూ స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం జరిగిన భజన, అన్నదాన కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# అదుపులేని ఖాకీతో ఆగమే

## రామగుండానికి పోలీస్ గండం?

- రామగుండంలో మితిమీరిన ఓ పోలీసు వ్యవహారం
- పాలకుల మెప్పుకోసం రోజుకో వివాదం
- స్మార్ట్ పోలీస్ అని ఓ వైపు ఉన్నతాధికారుల గొప్పలు...
- ఇక్కడేమో ఖాకీ బూతుల పర్వంపై పట్టింపులేనితనం
- ఎన్ని ఆరోపణలు వచ్చినా డోంట్ కేర్ అంటున్న ఖాకీ
- ప్రజాప్రతినిధుల అండదండలతో చెలరేగుతున్న వైనం
- ఇట్లయితే రామగుండంలో కాంగ్రెస్ గల్లంతే




**ఖాకీలంటే అందరికీ రక్షణ ఇచ్చేవారు మాత్రమే.అంతే తప్ప తమ పిల్లలను,భార్యలను కూడా కాన్వాయ్‌లో తిప్పుకుంటూ ఉండేవారు కాదని ప్రజాప్రతినిధులు గుర్తించాలి.అవసరం ఉన్నా లేకున్నా డాబు దర్పాలు చూపెట్టడానికి పోలీసుల సైరన్‌లతో నిత్యం తమ చుట్టూ పోలీసులను తిప్పించుకోవడం అనేది ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుంది.**

**పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలో ఓ ఖాకీ తీరు అదుపుతప్పినట్లుగా ఆరోపణలు వస్తున్నాయి.నిత్యం ఏదో ఒక వివాదాన్ని తీసుకొస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.సుదీర్ఘ కాలం తర్వాత రామగుండంలో గడిచిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందిన విషయం తెల్సిందే.ఎన్నో ఆశల నడుమ పాలనా పగ్గాలు చేపట్టిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రామగుండం సుందరీకరణ పేరుతో అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారు,ముఖ్యంగా గోదావరిఖని పట్టణంలో రోడ్లవెడల్పు కార్యక్రమాన్ని చేపడుతూ అనేక కట్టడాల కూల్చివేతలను చేపడుతున్న విషయం కూడా తెల్సిందే.ఈ క్రమంలో కొన్నివర్గాల నుంచి ఎమ్మెల్యే నిర్ణయాలపై హర్షం వ్యక్తం అవుతుండగా మరికొన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇదంతా ఇలా ఉంటే రామగుండం నియోజకవర్గంలో ఓ కీలక ఠాణాలో పనిచేస్తున్న ఓ ఖాకీ ఉన్నతాధికారి వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారింది.విధినిర్వహణ పేరుతో మితిమీరిన పోకడ పోతున్నారనే విమర్శలు వస్తున్నాయి.**




**అవసరం ఉన్నా లేకున్నా డాబు దర్పాలు చూపెట్టడానికి పోలీసుల సైరన్‌లతో నిత్యం తమ చుట్టూ పోలీసులను తిప్పించుకోవడం అనేది ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుంది.ఇప్పటికైనా పాలకులు, పోలీసుల ఉన్నతాధికారులు మితిమీరి ప్రవర్తిస్తున్న ఖాకీలకు ముకుతాడు వేయకపోతే వచ్చే ఎన్నికల్లో తమకి డిపాజిట్లు రాకుండా చేయడంలో ఇదే అంశం ప్రధాన కారణంగా ఉంటుంది. ఇందులో ఎలాంటి సందేహం అక్కర్లేదని గమనించాలి.**

**పెద్దపల్లి** జిల్లా రామగుండం నియోజకవర్గంలో ఓ ఖాకీ తీరు అదుపుతప్పినట్లుగా ఆరోపణలు వస్తున్నాయి.నిత్యం ఏదో ఒక వివాదాన్ని తీసుకొస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.సుదీర్ఘ కాలం తర్వాత రామగుండంలో గడిచిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందిన విషయం తెల్సిందే.ఎన్నో ఆశల నడుమ పాలనా పగ్గాలు చేపట్టిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రామగుండం సుందరీకరణ పేరుతో అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారు.ముఖ్యంగా గోదావరిఖని పట్టణంలో రోడ్లవెడల్పు కార్యక్రమాన్ని చేపడుతూ అనేక కట్టడాల కూల్చివేతలను చేపడుతున్న విషయం కూడా తెల్సిందే.ఈ క్రమంలో కొన్నివర్గాల నుంచి ఎమ్మెల్యే నిర్ణయాలపై హర్షం వ్యక్తం అవుతుండగా మరికొన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.ఇదంతా ఇలా ఉంటే రామగుండం నియోజకవర్గంలో ఓ కీలక ఠాణాలో పనిచేస్తున్న ఓ ఖాకీ ఉన్నతాధికారి వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారింది. విధినిర్వహణ పేరుతో మితిమీరిన పోకడ పోతున్నారనే విమర్శలు వస్తున్నాయి.నిత్యం ఎవరినో ఒకరిని దుర్భాషలాడటంతోపాటు తానేదో క్రమశిక్షణ గల పోలీసు అధికారిగా చూపించుకోవడం కోసం పౌరుల విషయంలో అదుపులేని పోకడలకు సదరు ఖాకీ తెరతీయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. గతంలో గోదావరిఖనికి చెందిన ఓ న్యాయవాదిపై దురుసు ప్రవర్తనతో న్యాయవాదులంతా చాలారోజుల పాటు విధులను భహిష్కరించి సదరు ఖాకీకి వ్యతిరేకంగా నిరసన చేపట్టిన విషయం తెల్సిందే.అదే విధంగా రామగుండం కార్పొరేషన్ ఎన్నికల సమయంలో కొందరిపై సదరు ఖాకీ చూపెట్టిన అత్యుత్సాహం వివాదాస్పదంగా మారడం తెల్సిందే.అదేవిధంగా గోదావరిఖని పట్టణంలో కట్టడాల కూల్చివేతల సమయంలో వివాదాస్పద ఖాకీ చూపెట్టిన అతి తీవ్ర దుమారాన్నే లేపింది.బాధితులతో సామరస్యంగా మాట్లాడకుండా మితిమీరిని ప్రవర్తనతో యావత్ పోలీస్ వ్యవస్థకే అపప్రథ తీసుకొస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.గిట్టని వారిని టార్గెట్ చేసి అక్రమ కేసులు బనాయించి వారిని వేధింపులకు గురిచేయడానికి సదరు ఖాకీ కొందరు ప్రజాప్రతినిధులకు చక్కగా ఉపయోగపడుతున్నారనే గుసగుసలు విన్పిస్తున్నాయి.ప్రతీ రోజూ తన శృతిమించిన ప్రవర్తనతో ఒకరిద్దరు వ్యక్తులను ప్రభుత్వానికి వ్యతిరేకంగా మార్చడంలో సదరు ఖాకీ ప్రవర్తన ఉంటోంది.తాజాగా గోదావరిఖని పట్టణంలో తెలంగాణ ఉద్యమకారుడు ఒకరిపై సదరు ఖాకీ బూతుల పంచాంగం విప్పడంతో సదరు ఉద్యమకారుడు గోదావరిఖని చౌరస్తాలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని తీవ్ర నిరసన వ్యక్తం చేసిన విషయం కలకలం రేపుతోంది. గతంలో కూడా నాటి బీఆర్ఎస్ స్థానిక ప్రజాప్రతినిధులు కూడా కొందరు ఖాకీలను ఉపయోగించుకుని ప్రశ్నించే గొంతులను,ఎదురు తిరిగి నిలబడిన వారిని అక్రమ కేసులతో వేధించి చివరికి తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకుని గడిచిన ఎన్నికల్లో ఇంటిదారి పట్టిన విషయం తెల్సిందే.ఇప్పుడు కూడా ఇదే తరహాలో పరిస్థితులు ఉన్నాయనే అభిప్రాయాలు స్థానికుల నుంచి వ్యక్తమవుతోంది.ఓ వైపు స్మార్ట్ పోలీస్ అంటూ పోలీస్ ఉన్నతాధికారులు గొప్పలు చెప్పుకుంటుండగా రామగుండంలో మాత్రం ఆ విధానం అమలు కావడం లేదు. ఫిర్యాదుదారులు,పౌరుల విషయంలో పోలీసులు గౌరవంగా వ్యవహరించాలని పోలీసు ఉన్నతాధికారులు అనేక సమావేశాలు నిర్వహించి కిందిస్థాయి అధికారులకు హితబోధ చేస్తున్నా..అదంతా రామగుండం నియోజకవర్గ ఖాకీకి మాత్రం పట్టడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.నేనే మోనార్క్..నన్నేం చేయలేరు అనే తరహాలో ఈయన గారి వ్యవహారం ఉంటోంది.అయితే సదరు ఖాకీ ఎన్ని విమర్శలు, ఫిర్యాదులు వచ్చినా అతనిపై ఎలాంటి చర్యలు ఉండకపోవడం గమనార్హం. అంతలా సతరు ఖాకీ అదుపు తప్పి వ్యవహరించడం వెనక ప్రజాత్రినిధుల అండదండలే కారణమంటున్నారు.నీవు ఏమైనా చేసుకో..మేం చెప్పింది చేస్తే చాలు అనే ధోరణిలో ప్రజాప్రతినిధులు ఉండబట్టే ఖాకీలు తమ అసలు డ్యూటీని మరచి ఇతర వ్యవహారాలపై దృష్టిపెడుతున్నారని అంటున్నారు. వాస్తవానికి బీఆర్ఎస్ అధికారంలోకి రాక మునుపు పోలీసు అధికారుల బదిలీలు, పోస్టింగుల్లో ప్రజాప్రతినిధుల జోక్యం తక్కువగా ఉండేది.వారి ఉద్యోగ నిర్వహణలో మితిమీరిన జోక్యాలు ఉండేవి కావు.వారికి స్వేచ్ఛ ఉండేది.కానీ బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో పోలీసుల పోస్టింగులు, బదిలీలు స్థానిక ప్రజాప్రతినిధుల కనుసన్నలో నడిచేలా ప్రమాదకరమైన విధానాన్ని అమలు చేసిందనే విమర్శ ఉంది. దీంతో ప్రజాప్రతినిధుల మెప్పు కోసం కొందరు పోలీసులు తమ ఉద్యోగ నిర్వహణలో అనేక అడ్డదారులు తొక్కినట్లుగా ఆరోపణ లు ఉన్నాయి.అంతెందుకు రామగుండం కమిషనరేట్ పరిధిలోనే బీఆర్ఎస్ పాలనా కాలంలో అనేక అక్రమాలు,అక్రమ కేసులు రాజ్యమేలిన విషయం మరువరాదు. అనేక దుర్మార్గాలకు నాటి రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి వేదికగా మారడంతో ఆ ప్రభావం గడిచిన ఎన్నికల్లో చూపెట్టి నాటి ప్రజాప్రతినిధులంతా మట్టికరిచారు.ఇప్పుడు కూడా అదే తోవలో ఉన్నట్లుగా సూచనలు కన్పిస్తున్నాయి.పోలీసు అధికారులపై మితిమీరిన జోక్యం చేసుకుంటూ వారిని తమకు గిట్టని వారిని అణగదొక్కడానికి వాడుకోవాలనే దుర్మార్గపు పోకడను అనుసరిస్తున్నట్లుగా పరిస్థితి ఉంది.ఇది ఇలానే కొనసాగితే ప్రత్యర్థులను అణగదొక్కడానికి పోలీసులను ఉపయోగించుకుని తమ మాటను చెల్లుబాటు చేసుకుంటున్నామనే ఆనందంలో స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఉంటే అది వారిని ముంచే చర్యగానే ఉంటుంది. పోలీసులను తమ ఉద్యోగ నిర్వహణ తమని చేసుకోనివ్వాలి.వారికి తగినంత స్వేచ్ఛ ఇవ్వాలి.తమ మాట వినకపోతే బదిలీలంటూ బెదిరించుకుంటూపోతే అది ప్రభు త్వానికి చెడ్డపేరు తప్ప మరొకటి కాదు.ఇదే రామగుండానికి గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన ఓ పెద్దాయన కాలంలో ఖాకీల బదిలీలు,వారి ఉద్యోగ నిర్వహణ విషయంలో జోక్యం చేసుకోలేదంటారు.సదరు మాజీ ఎమ్మెల్యే తమ పార్టీ కార్యకర్తలు ఏదైనా పని విషయంలో ఒత్తిడి తీసుకొచ్చిన సందర్భంలో సదరు మాజీ ఎమ్మెల్యే ఉద్యోగస్తులను వారిపనిని వారు చేసుకోనివ్వండని కార్యకర్తలను మందలించేవారని గొప్పగా చెప్పుకుంటారు.ఇలాంటి సాంప్రదాయం కొనసాగినప్పడే పోలీసులపై ప్రజల్లో నమ్మకం కల్గుతుంది.ఖాకీలంటే అందరికీ రక్షణ ఇచ్చేవారు మాత్రమే.అంతే తప్ప తమ పిల్లలను,భార్యలను కూడా కాన్వాయ్‌లో తిప్పుకుంటూ ఉండే వారు కాదని ప్రజాప్రతినిధులు గుర్తించాలి.అవసరం ఉన్నా లేకున్నా డాబు దర్పాలు చూపెట్టడానికి పోలీసుల సైరన్‌లతో నిత్యం తమ చుట్టూ పోలీసులను తిప్పించుకోవడం అనేది ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుంది.ఇప్పటికైనా పాలకులు, పోలీసుల ఉన్నతాధికారులు మితిమీరి ప్రవర్తిస్తున్న ఖాకీలకు ముకుతాడు వేయకపోతే వచ్చే ఎన్నికల్లో తమకి డిపాజిట్లు రాకుండా చేయడంలో ఇదే అంశం ప్రధాన కారణంగా ఉంటుంది. ఇందులో ఎలాంటి సందేహం అక్కర్లేదని గమనించాలి. ఇదంతా ఇలా ఉంటే రామగుండంలో నిత్య వివాదాస్పద ఖాకీపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారా? లేక తనకు ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నాయనే కారణంతో చూసీచూడనట్లు ఉంటారో చూడాలి.

..............

**మానసాని కృష్ణా రెడ్డి**
**9618616110**